# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...


విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 297 గురువారం 13 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


- కటాఫ్ తేదీ, అర్హుల గుర్తింపుపై అందులోనే నిర్ణయం
- పేద రైతులకు ఊరట కలిగేలా చేయాలని నిశ్చయం
- ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధానాల పరిశీలన
- 'పీఎం-కిసాన్' తరహాలో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు,
- మరికొన్ని వర్గాలను మినహాయించాలా? వద్దా?
- మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

# రుణమాఫీపై ప్రణాళిక!

## విధివిధానాలపై వారంలో క్యాబినెట్ భేటీ



హైదరాబాద్

రైతు రుణమాఫీ అమలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగా కేంద్రం అమలుచేస్తున్న ప్రధానమంత్రి-కిసాన్ సమ్మాన్ నిధి సహా ఇతర రైతు సంక్షేమ పథకాలకు అనుసరిస్తున్న విధివిధానాలను పరిశీలిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో చేసిన అధికారులు చేసిన అధ్యయనాలను కూడా పరిగణనలోకి తీసుకుని.. పేద, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ప్రధానంగా ఉపశమనం కలిగేలా ఆ పథకాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు.. రుణమాఫీ విధివిధానాలను ఖరారు చేసేందుకు వారం రోజుల్లో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. రైతులకు ఇచ్చిన హామీమేరకు.. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇటీవలే వ్యవసాయశాఖ, ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. రుణమాఫీకి ఎన్ని నిధులు అవసరం? నిధుల సమీకరణకు ఉన్న మార్గాలు, అందు బాటులో ఉన్న వనరులన్నింటినీ ప్రభుత్వం పరిశీలిస్తోంది. మరోవైపు రుణమాఫీ అమలుకు ఏ తేదీని కటాఫ్‌గా తీసుకోవాలనే అంశంపైనా ఇంకా స్పష్టత - మిగతా3లో



# ప్రయాణికులపైనే 'టోల్' భారం

## టోల్ రేట్లు పెరగడంతో సెస్సు పెంచేసిన టీజీఎస్ ఆర్టీసీ

## టోల్ రూట్లలో ఒక్కో టికెట్‌పై రూ.3 చొప్పున వసూలు

హైదరాబాద్

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సు చార్జీల్లో టోల్ సెస్సు మరోసారి పెరిగింది. ఒక్కో టికెట్‌పై రూ.3 చొప్పున పెరిగిన టోల్ చార్జీలు ఇటీవలే అమల్లోకి వచ్చాయి. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.10గా ఉన్న చార్జీని రూ.13 చొప్పున వసూలు చేస్తుండగా, డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని, గరుడ, వజ్ర, బస్సుల్లో రూ.13 నుంచి రూ.16, గరుడ ప్లస్ బస్సుల్లో రూ.14 నుంచి రూ.17, నాన్ ఏసీ స్లీపర్, హైబ్రిడ్ స్లీపర్ బస్సుల్లో రూ.15 నుంచి రూ.18, ఏసీ స్లీపర్ బస్సుల్లో రూ.20 నుంచి రూ.23 చొప్పున - మిగతా3లో

# ప్రభుత్వ ఒత్తిడి వల్లే!



- నిర్దిష్ట వ్యవధిలోగా బ్యారేజీల నిర్మాణం..
- పూర్తి చేయాలని సర్కారు ఒత్తిడి చేసింది
- ప్రభుత్వం చెప్పినట్లే బ్యారేజీలు కట్టాం
- అందుకే ప్రతికూల ఫలితాలు వచ్చాయి
- కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్‌కు..
- నివేదించిన బ్యారేజీల నిర్మాణ సంస్థలు

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణాన్ని నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని గత ప్రభుత్వం తమపై ఒత్తిడి చేసిందని నిర్మాణ సంస్థలు తెలిపాయి. ఆ ఒత్తిడితో నిర్మించడం వల్లే ప్రతికూల ఫలితాలు వచ్చాయని పేర్కొన్నాయి. జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ బుధవారం బ్యారేజీల నిర్మాణ సంస్థలను విచారించగా.. ఈ మేరకు తమ వివరణ ఇచ్చాయి. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణ బాధ్యతలు చేపట్టిన సంస్థలన్నీ ఒకే అభిప్రాయాన్ని కమిషన్ ముందు వ్యక్తం చేశాయి. పనులు - మిగతా3లో



## ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిపోయిన అంశం

- కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఏపీకి ప్రత్యేక ప్యాకేజి ఇచ్చింది
- విభజన చట్టం హామీలను కూడా అమలు చేసింది
- వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతా
- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కీలక వ్యాఖ్యలు



## మద్యం దుష్ప్రభావాలకు చెక్ పెట్టే జెల్

- రక్తంలోకి ప్రవేశించిన మద్యం
- హానికరంగా మారకుండా అడ్డుకట్ట
- ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞుల ఘనత



# డిజిటల్ క్రాప్ సర్వే!

- పంటల నమోదుకు కొత్త విధానం
- డిజిటల్ సర్వేపై వ్యవసాయ శాఖ కసరత్తు
- నిరుడు పైలట్ ప్రాజెక్టుగా 16 మండలాల్లో..
- ఈ సీజన్ నుంచి రాష్ట్రమంతా అమలుకు

హైదరాబాద్

రాష్ట్రంలో పంటల సాగు నమోదును మరింత కచ్చితంగా లెక్కించేందుకు కొత్త విధానం అమలుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగానే 'డిజిటల్ క్రాప్ సర్వే'ను చేయనున్నది. ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఇప్పటికే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 16 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా డిజిటల్ క్రాప్ సర్వేను అమలు చేసింది. ఈ వానకాలం సీజన్ నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. దీంతో డిజిటల్ సర్వేను అమలు చేయాలా లేక పాత పద్ధతిలోనే చేయాలా అనే అంశంపై వ్యవసాయ శాఖ చర్చిస్తున్నది. వీలైతే వచ్చే ఏడాది నుంచి అమలుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరాలని భావిస్తున్నది. కేంద్రం అనుమతిస్తే డిజిటల్ క్రాప్ సర్వే వచ్చే ఏడాదికి వాయిదా పడుతుంది లేనిపక్షంలో ఈ సీజన్ నుంచి అమల్లోకి రానున్నది. ప్రతి రైతు, ప్రతి పంట ఫొటో పంట సాగు విస్తీర్ణం లెక్కింపులో ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం, డిజిటల్ క్రాప్ సర్వే దాదాపుగా ఒకే విధంగా ఉన్నాయి. డిజిటల్ క్రాప్ సర్వేలో అదనంగా పంట ఫొటోలు, రైతు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. తద్వారా ఏ రైతు ఏ పంట వేశారనేది ఆధారాలతో - మిగతా3లో

# డైలమాలో రాహుల్

**తిరువనంతపురం :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ డైలమాలో పడ్డారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని రాయ్‌బరేలీతో పాటు కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా ఆయన గెలుపొందారు. ఈ నేపథ్యంలో బుధవారం కేరళలోని మలప్పురంలో నిర్వహించిన ర్యాలీలో రాహుల్ పాల్గొన్నారు. తనను వరుసగా రెండోసారి ఎంపీగా గెలిపించినందుకు వయనాడ్ ప్రజలకు రాహుల్ గాంధీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఒక నియోజకవర్గానికి తాను రాజీనామా చేయవలసి ఉందన్నారు. కానీ తాను ఈ రెండు నియోజకవర్గాల్లో సంతోషంగా ఉన్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ రెండు స్థానాల్లో దేనికి రాజీనామా చేయాలో తెలియన ఓ విధమైన డైలమాలో తాను ఉన్నట్లు రాహుల్ గాంధీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

అయితే తాను ఎటువంటి నిర్ణయం తీసుకున్నాననేది త్వరలో



మీరు చూడబోతున్నారని వాయనాడ్ ప్రజలకు రాహుల్ తెలిపారు. వయనాడ్ ఎంపీగా ఇటీవల విజయం సాధించిన అనంతరం రాహుల్ తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేశారు. మరోవైపు ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ వ్యంగ్య బాణాలు సంధించారు. ప్రధాని నరేంద్ర మోదీ.. పరమాత్ముని దయతో పారిశ్రామిక వేత్తలు అదానీ, అంబానీలకు అనుకూలంగా పని చేస్తారన్నారు. కానీ తాను సామాన్య మానవుడునని చెప్పారు. దీంతో చాలా సాధారణంగా ఉంటానని చెప్పారు. దేశంలోని పేదవారే తనకు దేవుళ్లన్నారు. ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రధాని మోదీ దృక్పథంలో మార్పు వచ్చిందని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇంకోవైపు ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ రెండు నియోజకవర్గాల్లో ఒక స్థానానికి రాజీనామా చేయనున్నట్లు.. పార్టీ పెద్దలకు రాహుల్ ఓ స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో పార్టీ పెద్దలు రాహుల్ నిర్ణయాన్ని ప్రకటించనున్నారని తెలుస్తుంది.

# మద్యం దుష్ప్రభావాలకుచెక్ పెట్టే జెల్

**న్యూఢిల్లీ :** మద్యం మత్తుకు, ఆ మహమ్మారి వల్ల శరీరంపై పడే దుష్ప్రభావాలకూ చెక్ పెట్టే వినూత్న ప్రొటీన్ జెల్‌ను స్విస్ శాస్త్రజ్ఞులు అభివృద్ధి చేశారు. శరీరంలోకి ప్రవేశించిన మద్యం ప్రమాదకరమైన ఎసిటాల్డిహైడ్‌గా మారకముందే.. దాన్ని నిరపాయకరమైన ఎసిటిక్ యాసిడ్ మార్చేయడం ఈ జెల్ ప్రత్యేకత. సాధారణంగా మనం తినే ఆహారం జీర్ణవాహికలో నిదానంగా జీర్ణమవుతుంది. కానీ, మద్యం అలా నెమ్మదిగా కాకుండా.. జీర్ణవాహిక గోడలపై ఉండే మ్యూక్స-మెంబ్రేన్ పొరల గుండా రక్తంలోకి ప్రవేశించి, రక్త కణాల ద్వారా శరీరమంతా వేగంగా వ్యాపిస్తుంది. అందుకే మద్యం తీసుకున్న కొద్దిసేపటికే మత్తు కలగడం మొదలవుతుంది. అలా రక్తంలోకి చేరిన ఆల్కహాల్‌ను మన కాలేయం బ్రేక్‌డౌన్ చేసి అసిటాల్డిహైడ్‌గా మారుస్తుంది. అది కొద్దిసేపటికే ఎలాంటి ప్రమాదం లేని అసిటిక్ యాసిడ్‌గా మారుతుంది. కానీ.. ఆలోగానే అసిటాల్డిహైడ్ మన శరీరానికి తీవ్ర హాని చేస్తుంది. ఈ నేపథ్యంలోనే స్విట్జర్లాండ్‌కు చెందిన ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులకు ఒక ఆలోచన వచ్చింది.

శరీరంలోకి ప్రవేశించిన ఆల్కహాల్ రక్తంలోకి ప్రవేశించి, ఆపై అసిటాల్డిహైడ్‌గా మారకుండా నేరుగా అసిటిక్ యాసిడ్‌గా మారిపోయేలా చేస్తే మద్యం మత్తును, ఇతర దుష్ప్రభావాలను అరికట్టవచ్చన్నది వారి ఆలోచన. దీనిపై రకరకాల ప్రయోగాలు చేసి, చివరికి.. వే ప్రొటీన్లకు ఐరన్, గ్లూకోజ్, గోల్డ్ నానో పార్టికల్స్‌ను జోడించి తాము అనుకున్న జెల్‌ను తయారు చేయగలిగారు. ప్రయోగాల్లో భాగంగా ఆ జెల్‌ను రెండు గ్రూపుల ఎలుకలకు ఇచ్చారు. ఒక గ్రూపులో ఎలుకలకు ఒక్కసారి మద్యం తాగించారు. మరో గ్రూపులోని ఎలుకలకు 10 రోజులపాటు మద్యం తాగించారు. ఒక్కసారి మద్యం తాగించిన ఎలుకలకు ఈ జెల్‌ను ఇచ్చి.. అరగంట తర్వాత పరీక్ష చేయగా, వాటిలో ఆల్కహాల్ స్థాయిలు 40 శాతం తగ్గినట్టు వెల్లడైంది. ఐదుగంటల తర్వాత పరీక్ష చేయగా.. మద్యం స్థాయిలు 56 శాతం మేర తగ్గాయి. పదిరోజులపాటు వరుసగా ఆల్కహాల్ ఇచ్చిన ఎలుకలకు ఈ



జెల్ ఇవ్వగా.. అది మద్యం వల్ల కలిగే దుష్ప్రభావాలను బాగా తగ్గించినట్టు గమనించారు. ఆ ఎలుకల కాలేయం, ప్లీహం, పేగులు అంత ఎక్కువగా దెబ్బతినకుండా ఉండడాన్ని శాస్త్రజ్ఞులు గుర్తించారు. అయితే.. ఈ జెల్ ప్రభావం మానవులపై ఎలా ఉంటుందో పరీక్షించాల్సి ఉంది. మానవులపై కూడా జెల్ ఇలాగే పనిచేస్తే ఏటా మద్యపాన వ్యసనం వల్ల సంభవిస్తున్న 30 లక్షల మరణాలకు చెక్ పెట్టవచ్చని ఈటీహెచ్ జ్యూరిక్ శాస్త్రజ్ఞులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**కాలేయంలో కాకుండా...**

"ఆల్కహాల్ సాధారణంగా కాలేయంలో బ్రేక్‌డౌన్ అవుతుంది. కానీ, మా జెల్ ఆ ప్రక్రియను కాలేయం నుంచి జీర్ణవాహికకు మారుస్తుంది" అని ఈ పరిశోధనలోపాలుపంచుకున్నడాక్టర్ రఫెల్ మెజెంగా వివరించారు. అసలు మద్యపానం చేయకుండా ఉండడమే ఉత్తమమమైన పని అని.. ఇప్పటికే ఆ వ్యసనానికి బానిసలై, మానలేనివారికి తమ జెల్ ఉపయోగపడుతుందని ఆయనఆశాభావం వ్యక్తం చేశారు. అయితే.. తాగిన మద్యం పేగుల్లో ఉండేదాకా మాత్రమే తమ జెల్ పనిచేస్తుందని, ఒక్కసారి ఆ ఆల్కహాల్ రక్తంలోకి ప్రవేశిస్తే మాత్రం దాని ప్రభావాన్ని జెల్ ఏ మాత్రం రివర్స్ చేయలేదని డాక్టర్ రఫెల్ స్పష్టం చేశారు. అంటే.. మద్యం మత్తు ఆవరించాక జెల్ తీసుకుంటే మత్తు పోదు. కాకపోతే, అవయవాలు డ్యామేజ్ కాకుండా కాపాడుతుంది. మద్యం తాగకముందే ఈ జెల్‌ను నోటి ద్వారా మాత్ర రూపంలోతీసుకుంటే ఎక్కువ ఉపయోగం ఉంటుందని శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. చివరాఖరు.. ఈ జెల్ తీసుకుంటే రక్తంలో మద్యం స్థాయిలు తగ్గుతాయంటే.. భవిష్యత్తులో మందుబాబులు డ్రంకెన్‌డ్రైవ్‌ల్లో పట్టుబడకుండా ఉండడానికి వీటిని విచ్చలవిడిగా వాడేయరూ?

# ఎర్రకోటపై దాడి కేసు..

# ఉగ్రవాది క్షమాభిక్ష పిటిషన్‌ని కొట్టేసిన రాష్ట్రపతి

**ఢిల్లీ:** ఢిల్లీలోని ఎర్రకోటపై 24 ఏళ్ల కిందట ఉగ్రదాడులు జరిగిన విషయం విదితమే. అయితే ఈ కేసులో దోషిగా నిర్ధారణ అయిన పాకిస్థాన్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ రాష్ట్రపతి ముందు క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము క్షమాభిక్ష పిటిషన్‌ని తిరస్కరించారు. దాఖలు చేసుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తోసిపుచ్చినట్లు బుధవారం ఓ అధికారి తెలిపారు. రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ముర్ము తిరస్కరించిన రెండో క్షమాభిక్ష పిటిషన్ ఇదే. ఈ కేసులో మహ్మద్ ఆరిఫ్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. 2022 నవంబరు 3న అతడి రివ్యూ పిటిషన్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో అతనికి మరణశిక్ష ఖరారైంది. ఆరిఫ్.. మే 15న ఆరిఫ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును క్షమాభిక్ష కోరాడు. అయితే అతడి పిటిషన్‌ను ముర్ము మే 27న తోసిపుచ్చగా, 29న ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. 2000 డిసెంబరు 22న ఎర్రకోట వద్ద సైనిక స్థావరంపై పాక్ ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు భారత జవాన్లు మృతి చెందారు. దాడి జరిగిన నాలుగు రోజుల తర్వాత ఢిల్లీ పోలీసులు మహ్మద్ ఆరిఫ్‌ను అరెస్ట్ చేశారు. మహ్మద్‌ను లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందినవాడి గుర్తించారు. మిలిటెంట్లతో





కలిసి ఆరిఫ్ కుట్ర పన్నాడన్న ఆరోపణలు కోర్టులో నిరూపిత మయ్యాయి. ఎర్రకోటపై దాడికి పాల్పడిన అబుబిలాల్, అబుషాద్, అబుహైదర్‌లు వేర్వేరు ఎన్ కౌంటర్లలో హతమయ్యారు. వీరంతా అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారని 2022లో సుప్రీంకోర్టు తెలిపింది.

**మహ్మద్ ఆరిఫ్‌కు మరో ఆప్షన్..**

రాష్ట్రపతి కూడా క్షమాభిక్ష పిటిషన్‌ని తిరస్కరించడంతో మరణ శిక్ష పడటం దాదాపు నిర్ధారణ అయినట్లేనని నిపుణులు అంటున్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం సుదీర్ఘ జాప్యం కారణంగా దోషి తన శిక్షను మార్చాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానం తలుపులు తట్టవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# కోడలు కర్కశం.. రూ.300 కోట్ల ఆస్తి కోసం మామను దారుణంగా...

నాగ్‌పూర్: ఆస్తుల కోసం సొంత వాళ్లన్ని బలితీసుకుంటున్న రోజులివి. మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అనే వాక్యానికి సరితూగే ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే ఒకటి బయటకి వచ్చింది. ఆస్తి కోసం ఓ కోడలు కిరాతకంగా వ్యవహరించింది. సొంత మామను కారుతో ఢీ కొట్టించి హత్య చేయించింది. తనపై అనుమానం రాకుండా సీన్ అల్లింది. కట్ చేస్తే.. పోలీసులు దర్యాప్తులో అడ్డంగా దొరికిపోయింది. మామను హత్య చేయడానికి రూ.కోటి సుపారీ ఇచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన పురుషోత్తం పుట్టేవార్(82) గతవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన తన భార్య శకుంతలను చూసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఓ కారు ఆయనను ఢీకొట్టింది. హిట్ అండ్ రన్‌గా భావించిన పోలీసులు కేసు నమోదుచేశారు.

## శరీర ఉష్ణోగ్రత పెరిగితే గుండెకు హాని



న్యూఢిల్లీ: వయోజనుల శరీర ఉష్ణోగ్రత పెరిగితే, వారి గుండె గోడలకు రక్త ప్రవాహం పెరుగుతుందని, ఫలితంగా గుండె ఒత్తిడికి గురవుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. గుండెపై ఒత్తిడిని నిరోధించేందుకు చల్లని ప్రదేశాల్లో ఉండటం శ్రేయస్కరమని తెలిసింది. 'అన్నల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్' జర్నల్‌లో ఈ అధ్యయన నివేదిక ప్రచురితమైంది. 20 మంది యువ ఆరోగ్యవంతులు, 21 మంది ఆరోగ్యంగా ఉన్న నడి వయస్కులు, 20 మంది కరోనరీ ఆర్టెరీ డిసీజ్ (సీఏడీ)తో బాధ పడుతున్న వృద్ధులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. వీరి శరీర ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెల్సియస్ వరకు పెంచి, పరిస్థితులను పరిశీలించారు. సీఏడీతో బాధపడుతున్న ఏడుగురి రక్త నాళాలు బంధింపబడటం వల్ల గుండెకు రక్త ప్రవాహంలో అడ్డంకులు ఏర్పడినట్లు వెల్లడైంది. అయినప్పటికీ వీరిలో అలాంటి లక్షణాలు కనిపించలేదు. గుండెకు ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని కరోనరీ ఆర్టెరీస్ సరఫరా చేస్తాయి. ఈ కరోనరీ ఆర్టెరీస్‌ను కుంచించుకుపోయేలా కానీ, అడ్డంకులు ఏర్పడేలా కానీ చేసేదే సీఏడీ వ్యాధి. ఈ నాళాల్లో కొలెస్ట్రాల్ సహా పాచిని పేరుకుపోయేలా చేస్తుంది. ఫలితంగా గుండె కండరాలకు రక్త ప్రవాహం పరిమితమవుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పుష్కలంగా నీరు తాగాలి. ఆల్కహాల్, కెఫీన్ తీసుకోకూడదు. తేలికగా, వదులుగా ఉండే, లేత రంగు దుస్తులను ధరించాలి.

## ఏపీకి ప్రత్యేక హెూదా ముగిసిపోయిన అంశం

**హైదరాబాద్ :** ఏపీకి ప్రత్యేక హెూదా ముగిసిపోయిన అంశమని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఏపీకి ప్రత్యేక ప్యాకేజి ఇచ్చిందని తెలిపారు. విభజన చట్టం హామీలను కూడా అమలు



చేసిందని పేర్కొన్నారు. బుధవారం ఏపీలో సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు. రాబోయే ఐదేళ్లు కూటమితో కలిసి ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

## అసెంబ్లీకి రాజీనామా చేసిన అఖిలేష్ యాదవ్, అయోధ్య ఎంపీ



**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లోని కర్హాల్ అసెంబ్లీ సభ్యత్వానికి బుధవారంనాడు రాజీనామా చేశారు. కన్నౌజ్ లోక్‌సభ స్థానానికి అఖిలేష్ యాదవ్ ఇటీవల ఎన్నిక కావడంతో ఎంపీ పదవిలో కొనసాగేందుకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అఖిలేష్‌తో పాటు ఫైజాబాద్ నుంచి లోక్‌సభకు ఎన్నికైన సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత అవదేశ్ ప్రసాద్ (%ూఘ్ఖుుఎవంష్ట ్రాథ్ఖుయిుఎ%) సైతం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఇరువురి నేతల రాజీనామా లేఖలు తమకు అందినట్టు లెజిస్లేటివ్ అసెంబ్లీ కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రదీప్ దూబే ధ్రువీకరించారు. అఖిలేష్ యాదవ్ 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కర్హాల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అప్పట్నించి రాష్ట్ర అసెంబ్లీలో విపక్ష నేతగా కొనసాగుతున్నారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో కన్నౌజ్ నియోజకవర్గంలో 1,70,99 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థి సుబ్రత్ పాఠక్‌పై అఖిలేష్ ఘనవిజయం సాధించడంతో పార్లమెంటు సీటును ఉంచుకుని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు మంగళవారంనాడు నిర్ణయించుకున్నారు. పార్టీ కార్యకర్తలతో సంప్రదించే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మీడియాకు ఆయన తెలిపారు. అసెంబ్లీలో విపక్ష నేతగా ఎవరిని ఎంపిక చేస్తారనే విషయంపై అడిగినప్పుడు పార్టీ ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. కాగా, సమాజ్‌వాద్ పార్టీ తరఫున లోక్‌సభా పక్ష నాయకుడిగా అఖిలేష్ ఉంటారని ఆ పార్టీ సైతం ప్రకటించింది.

## కోర్టులో పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు

**బెంగుళూరు :** కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని బెదిరించిన నిందితుడు గ్యాంగ్‌స్టర్ జయేష్ పూజారీ.. బుధవారం కోర్టులో పాకిస్థాన్ అనుకూలంగా నినాదాలు చేశాడు. దీంతో అతడిని పోలీసులు బలవంతంగా కోర్టు నుంచి బయటకు తీసుకెళ్లారు. అనంతరం అతడిని ఏపీఎంసీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అందుకు సంబంధించిన వీడియో.. సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కర్ణాటక ఐపీఎస్ అధికారి అలోక్ కుమార్‌కు ప్రాణ హాని తలపెట్టిన కేసులో అతడిని పోలీసులు బుధవారం బెళగావి జిల్లా కోర్టుకు తీసుకు వచ్చారు. ఆ క్రమంలో కోర్టులో అతడు పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. అయితే పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేయడంతో జయేష్ పూజారీపై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. జయేష్ పూజారీ స్వస్థలం కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా. ప్రస్తుతం అతడు హిండల్గ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. ఓ హత్య కేసులో జయేష్ పూజారీకి ఉరిశిక్ష వేసింది. ఆ క్రమంలో అతడు జైలు శిక్ష అనుభవిస్తున్నారు. అయితే గతేడాది నాగపూర్‌లోని నితిన్ గడ్కరీ కార్యాలయానికి ఫోన్ చేసి.. రూ. 100 కోట్లు డిమాండ్ చేశాడు. ఆ నగదు మొత్తం ఇవ్వకుంటే గడ్కరీని హత్య చేస్తామంటూ బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తులో భాగంగా పోన్ కాల్స్‌ను ఎక్కడ నుంచి వచ్చాయంటూ ఆరా తీశారు. ఆ క్రమంలో ఈ కాల్స్ జయేష్ పూజారీ చేసినట్లు గుర్తించారు. అయితే జయేష్ ... దావుద్ ఇబ్రహీం ముఠా సభ్యుడని పోలీసులు తెలిపారు. అలాగే జైలు నుంచే నితిన్ గడ్కరీ కార్యాలయానికి పోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారని పోలీసులు వివరించారు.

# ప్రభుత్వ ఒత్తిడి వల్లే!

-మొదటిపేజీ తరువాయి

శరవేంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఒత్తిడి పెంచిందని చెప్పాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, ప్రభుత్వం అందించిన డిజైన్ల ప్రకారమే గడువులోగా పనులు పూర్తిచేసి బ్యారేజీలను అప్పగించామని తెలిపాయి. దీంతో వాస్తవాలు, కమిషన్‌కు నివేదించిన అంశాలన్నింటినీ అఫిడవిట్ల రూపంలో ఈ నెల 25లోగా అందించాలని ఆయా సంస్థలను జస్టిస్ ఘోష్ ఆదేశించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ అయిన ఎల్అండ్‌టీ తరపున ఆ సంస్థ వైస్ చైర్మన్లు ఎంవీ రామకృష్ణరాజు, సురేశ్‌కుమార్ విచారణకు హాజరయ్యారు. అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ అఫ్కాన్స్-విజేత జాయింట్ వెంచర్ తరపున హైడ్రో ప్రాజెక్టుల విభాగాధిపతి కె.మల్లికార్జునరావు, జీఎం శేఖర్‌దాస్, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ నుంచి డైరెక్టర్ ఏడూరి రమేశ్, ప్రాజెక్టు మేనేజర్ కె.ఈశ్వర్‌రావు పాల్గొని కమిషన్‌కు తమ వాదనలు వినిపించారు.



**లెక్క ప్రకారమే డి జైన్లు రూపొందించారా.?**

బ్యారేజీల నిర్మాణంలో కీలకమైన డిజైన్లకు ఆమోదం తెలిపిన నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో)లో పనిచేసిన/చేస్తున్న చీఫ్ ఇంజనీర్లు టి.శ్రీనివాస్, వి.మోహన్‌కుమార్‌తో సహా మొత్తం 13 మంది ఇంజనీర్లను కూడా జస్టిస్ పీసీ ఘోష్ బుధవారం విచారించారు. ఏయే అంశాలను ప్రామాణికం చేసుకొని డి జైన్లు రూపొందించారు? వాటిని రూపొందించింది మీరేనా? ఇతరులు ఇచ్చిన డిజైన్లకు మీరు ఆమోదం తెలిపారా? ఆమోదించే క్రమంలో ఏమైనా ఒత్తిడి ఉందా? నిర్మాణం జరిగే క్రమంలో డిజైన్లలో మధ్యలో మార్పులేమైనా చోటుచేసుకున్నాయా? షీట్ ఫైల్స్‌కు బదులుగా సీకెంట్ ఫైల్స్ వాడటం వల్లే బ్యారేజీలు విఫలమయ్యాయా? వంటి అంశాలపై ఆరా తీశారు. ఇక బ్యారేజీల వద్ద నీటి లభ్యతను తేల్చిన హైడ్రాలజీ విభాగంలోని చీఫ్ ఇంజనీర్‌తో పాటు మరో ఐదుగురు ఇంజనీర్లను కూడా కమిషన్ విచారించింది. అనంతరం కమిషన్ కార్యాలయంలో జస్టిస్ ఘోష్ విలేకరులతో మాట్లాడారు. నిర్మాణ సంస్థలన్నీ నిర్దిష్ట వ్యవధిలోగా పనులు పూర్తిచేయాల్సిందిగా తమకు ఒత్తిళ్లు వచ్చినట్లు చెప్పాయని తెలిపారు. ఇందుకు సంబంధించి ఆ సంస్థలు అఫిడవిట్లు దాఖలు చేశాక.. ఆ ఒత్తిళ్లకు గురిచేసిన వారికి కూడా నోటీసులిచ్చి విచారణకు పిలుస్తామన్నారు.

**కొందరు అధికారులు రాష్ట్రంలో లేరు..**

బ్యారేజీల నిర్మాణంతో ముడిపడి ఉన్న కొంతమంది అధికారులు రాష్ట్రంలో లేరని జస్టిస్ ఘోష్ తెలిపారు. రాష్ట్రానికి వచ్చాక వారిని కూడా విచారణకు పిలుస్తామని అన్నారు. మరోవైపు విజిలెన్స్ నివేదికలు అందాయని, ఆ నివేదిక ఇచ్చిన అధికారులతో కూడా సమావేశమవుతానని చెప్పారు. ఇక కమిషన్‌కు సహకరించేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ సభ్యులతో జస్టిస్ ఘోష్ గురువారం సమావేశం కానున్నారు. నిపుణుల కమిటీలో ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ సీబీ కామేశ్వర్‌రావు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఎన్.రమణమూర్తి తదితరులున్నారు. వీరు ఇప్పటికే కమిషన్ ఆదేశాలతో బ్యారేజీలను కూడా పరిశీలించి, తగిన నివేదికను కమిషన్‌కు అందించారు.

# బాబు డైరెక్షన్‌లో రేవంత్

**ఆ ఐదు గ్రామాలను తిరిగి వెనక్కి తీసుకొనిరావాలి**

**ఆదిత్యనాథ్‌దాస్ నియామకాన్ని రద్దు చేయాలి**

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్**

**ధాన్యం, బియ్యం కుంభకోణంలో రేవంత్ పాత్ర: పెద్ది సుదర్శన్‌రెడ్డి**




**హైదరాబాద్ :** ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఇందులో భాగంగానే ఏపీ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన ఆధిత్యనాథ్‌దాస్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమించారని విమర్శించారు. ఈ నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పదేండ్ల తర్వాత తెలంగాణపై చంద్రబాబు, రేవంత్ కలిసి కుట్రలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ నాడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర బంద్ పాటించిందని, కానీ, రేవంత్‌రెడ్డి ఒక్కమాట కూడా మాట్లాడలేదని చెప్పారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నవిధంగా ఏపీలో విలీనం చేసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. భద్రాచలం రూరల్ మండలంలోని ఏటపాక, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల, పిచ్చుకలపాడు పంచాయతీలను తెలంగాణలో కలిపే విధంగా రేవంత్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్‌పై కమిషన్లను నియమిస్తూ, కాంగ్రెస్ మంత్రులు మాత్రం కమీషన్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కిషన్‌రెడ్డి చొరవ తీసుకొని సింగరేణి కార్మికులకు ఐటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తెలంగాణ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

**ఆ కుంభకోణంలో సీఎంకు పాత్ర: పెద్ది సుదర్శన్‌రెడ్డి**

సివిల్ సైప్లె కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి పాత్ర ఉన్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై త్వరలోనే సివిల్ సైప్లె భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధాన్యం, బియ్యం కొనుగోళ్లలో సీఎం రేవంత్‌రెడ్డికి వాటాలు లేకుంటే దానిపై ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పౌరసరఫరాల శాఖపై ఎందుకు సమీక్ష చేయడం లేదని ప్రశ్నించారు. ధాన్యం టెండర్లు దక్కించుకున్న కంపెనీలకు మరో రెండు నెలల గడువు పెంచినట్టుగా సమాచారం ఉన్నదని, ఆ వివరాలను బయటికి రానివ్వడంలేదని, మీడియాను కూడా పౌరసరఫరాలశాఖ కార్యాలయంలోకి అనుమతించడంలేదని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'బ్రాహ్మణ పరిషత్'కు బకాయి 70కోట్లు


**విదేశాల్లో 280మంది విద్యార్థుల తిప్పలు**

**మరో 200మంది ఎదురుచూపులు**

**'బెస్ట్' లబ్ధిదారులకూ అందని చెక్కులు**

**మరో 1500 దరఖాస్తులు పెండింగ్**

**ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తులు**



**హైదరాబాద్ :** ప్రభుత్వంపై నమ్మకంతో ఎన్నో ఆశలు పెట్టుకొని విదేశాల్లో చదువు కోసం వెళ్లిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 'తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్'లో ప్రధానంగా 'వివేకానంద విదేశీ విద్యా' పథకం, 'బ్రాహ్మిణ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కీమ్ ఆఫ్ తెలంగాణ (బెస్ట్)' పథకాలకు రూ.70కోట్ల బకాయిలు పెండింగులో ఉండడంతో అటు విద్యార్థులు, ఇటు చిరువ్యాపారులకు నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన విద్యార్థులు ఆయా యూనివర్సిటీల్లో ఫీజులు చెల్లించి ప్రవేశాలు పొందితే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా ప్రభుత్వం ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.20లక్షల చొప్పున రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం వివేకానంద విదేశీ విద్యా పథకం కింద 280 మంది ఎంపికయ్యారు. వీరికి అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం మంజూరు పత్రాలు కూడా ఇచ్చింది. మరో 200మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు పూర్తికాగా వారికి మంజూరు పత్రాలు అందలేదు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో మంజూరైన విద్యార్థులకు నిధులు, ఇంటర్వ్యూలైన విద్యార్థులకు మంజూరు పత్రాలు నిలిచిపోయాయి. ఈలోగా లబ్ధిదారులు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో స్వల్పకాల రుణాలు తీసుకొని యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందారు. ఎన్నికలయ్యాక నిధులు వస్తాయనుకుంటే ఇప్పటికీ ప్రభుత్వం విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలకమండలిని రద్దుచేసింది. ఆరు నెలలవుతున్నా ఇప్పటికీ కొత్త పాలకమండలిని నియమించలేదు.

**విదేశాల్లో బాధలు వర్ణనాతీతం**

మంజూరు పత్రాలు వచ్చినవారికి సు మారు రూ.50కోట్ల దాకా పెండింగ్‌లో ఉ న్నాయి. దీంతో అప్పుచేసి విదేశాలకు వెళ్లిన 280మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చాలామంది విద్యాభ్యాసంతోపాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నా వచ్చే ఆదా యం అక్కడి ఖర్చులకే సరిపోవడంలేదని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఫైనాన్స్ సంస్థల వేధింపులు పెరిగిపోవడంతో తమ పిల్లలు విద్యను సరిగా కొనసాగించలేక పోతున్నారని, మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు, ఇంటర్వ్యూలు పూర్తయిన 200మంది అభ్యర్థుల పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది.

**ఇరకాటంలో 'బెస్ట్' లబ్ధిదారులు**

పేద బ్రాహ్మణుల స్వయం ఉపాధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం బెస్ట్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సుమారు 400మంది ఈ పథకం కింద ఎంపికయ్యారు. మరో 1500దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. 400మంది లబ్ధిదారులకు రూ.20కోట్ల దాకా సహాయం అందాల్సి ఉన్నది. నిధులు వస్తాయన్న ఆశతో అప్పు చేసి వ్యాపారాలు పెట్టుకున్నవారు ఆరు నెలలు దాటినా నిధులు రాక వడ్డీలు కట్టలేక ఇరకాటంలో పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందేదని, అదే ఆశతో తాము అప్పుచేసి వ్యాపారాలు పెట్టుకొని ఇప్పుడు ఇబ్బందుల్లో పడ్డామని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న తమను ప్రభు త్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## ప్రయాణికులపైనే 'టోల్' భారం




-మొదటిపేజీ తరువాయి

టోల్ సెస్‌ను వసూలు చేస్తున్నారు. హైవేలపై ఈ నెల 2 నుంచి బస్సుల్లో ప్రయాణించే పురుషులు మాత్రమే భరించాల్సి ఉంటుంది. నిత్యం 30 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. నగరంలో 12 లక్షల మంది, పల్లెవెలుగు బస్సుల్లో 12 లక్షల మంది చొప్పున ప్రయాణిస్తున్నారు. టోల్ సెస్ పెంపు భారం సుమారు 6 నుంచి 10 లక్షల మందిపై అదనపు భారం పడుతుందని అంచనా. ఈ పెంపుపై ఆర్టీసీ ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. పెరిగిన టోల్‌చార్జీతో ప్రయాణికులపై అదనపు భారం వేసిన ఆర్టీసీకి మాత్రం అదనపు ఆదాయం వస్తుంది. ఈ నేపథ్యంలో బస్సు సర్వీసుల వేళల్లోనూ ఆర్టీసీ అధికారులు మార్పులు చేశారు. టోల్‌చార్జీలు పెరిగినందున టికెట్‌లో టోల్‌చార్జీ పెరిగింది తప్ప.. టికెట్ రేటు కాదని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. సాధారణ చార్జీలు యథాతంధంగానే ఉన్నాయని,సాధారణ రూట్లలో టికెట్ చార్జీ ల్లో ఎలాంటి మార్పులు లేవని పేర్కొన్నది.

## డిజిటల్ క్రాప్ సర్వే!



-మొదటిపేజీ తరువాయి

ఉంటుందనేది అధికారుల అభిప్రాయం. కేంద్రం ఆదేశాలతో డిజిటల్ క్రాప్ సర్వేను ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌వంటి రాష్ట్రాలు పూర్తిస్థాయిలో అమలు చేస్తుండగా మరికొన్ని రాష్ట్రాల్లో పాక్షికంగా అమలు చేస్తున్నాయి. ఈ డిజిటల్ క్రాప్ సర్వే అమలుకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం అందించనున్నది.

**దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో%**

%పంట సర్వే కోసం కేసీఆర్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన విధానం దేశంలోనే అత్యుత్తమంగా నిలిచింది. టెక్నాలజీ సాయంతో పంట సర్వే విధానాన్ని దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో పంట సర్వేను మాన్యువల్‌గా చేసేవాళ్లు. ఈ విధానానికి స్వస్తి చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం దీన్ని ఆన్‌లైన్ చేసింది. ఆ తర్వాత మరింత మెరుగ్గా నిర్వహణకుగానూ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో ఫలానా సర్వే నెంబర్‌లో పంట సాగును నమోదు చేయాలంటే కచ్చితంగా ఆ అధికారి ఆ సర్వే నంబర్‌లో ఉండాల్సిందే. ఆ సర్వే నంబర్‌కు 50-100 మీటర్ల విస్తీర్ణంలో ఉంటేనే ఆ వివరాలు యాప్‌లో నమోదవుతాయి. దీంతో పంట సాగు విస్తీర్ణం కచ్చితత్వంతో నమోదయ్యేది.

## రుణమాఫీపై ప్రణాళిక!

-మొదటిపేజీ తరువాయి

రాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన డిసెంబరు ఏడో తేదీని (2023) కటాఫ్‌గా తీసుకుంటారా? మహాలక్ష్మి పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన డిసెంబరు తొమ్మిదిని తీసుకుంటారా? వచ్చే ఆగస్టు 15 తేదీ వరకున్న బకాయిలను కూడా తీసుకుంటారా? అనే అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశంఉంది. పెద్ద రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలా? వద్దా? అనే అంశంపైనా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద అర్హులైన రైతులకు కేంద్రం ఏటా రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. మంత్రులు, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర- రాష్ట్ర ఉద్యోగులు, రూ.10 వేలకు మించి పెన్షన్ అందుకునే రిటైర్డ్ ఉద్యోగులు, ఐటీ పన్ను చెల్లించేవారు, డాక్టర్లు, ఇంజనీర్లు, సీఏ, ఆర్కిటెక్ట్ లాంటి ప్రొపెషనల్స్‌ను పీఎం-కిసాన్ పథకం నుంచి కేంద్రం మినహాయించింది. ఆ పథకానికి కేంద్రం అనుసరించిన మార్గదర్శకాల వల్ల అసలైన రైతులకు లబ్ధి చేకూర్చిందనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలోనే.. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి రైతుకూ మేలు జరిగేలా రుణమాఫీ అమలుకు ఎలాంటి మార్గదర్శకాలు పాటించాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విస్తృత కసరత్తు చేస్తోంది. గతంలో జరిగిన రుణమాఫీ అమలు తీరును పరిశీలించడంతోపాటు.. ఇతర రాష్ట్రాల్లో రుణమాఫీ అమలుకు అనుసరించిన విధివిధానాలపై వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఉదాహరణకు.. మహారాష్ట్రలో సహకారశాఖను నోడల్ ఏజెన్సీగా పెట్టి రూ.2 లక్షల వరకూ ఉన్న అన్ని రుణాలూ కలిపి రూ.20 వేల కోట్ల మేర పంట రుణాలు మాఫీ చేశారు. డబ్బును నేరుగా రైతుల రుణ ఖాతాల్లో జమచేసి రుణవిముక్తులను చేశారు. నిర్ణీత గడువు(కటాఫ్ తేదీ)లో అప్పు తీసుకున్న రైతులు పెద్ద రైతులా? చిన్నరైతులా? అని చూడకుండా అసలు, వడ్డీ కలిపి రూ. 2 లక్షల వరకు మాఫీచేశారు. రాజస్థాన్‌లో రైతు రుణ ఉపశమన కమిషన్ ఏర్పాటుచేసి అక్కడే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. రిజిస్టర్డ్ బ్యాంకు, ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి రుణాలు తీసుకున్న చిన్న, సన్నకారు రైతులకు రుణమాఫీ చేశారు. వీటిలో ఏ రాష్ట్ర మోడల్‌ను ఇక్కడ పరిగణనలోకి తీసుకుని అమలు చేస్తారో తేలాల్సి ఉంది.

## టెట్ ఫలితాల విడుదల..

**హైదరాబాద్ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్-2024) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. పేపర్-1లో 67.13%, పేపర్-2లో 34.18% మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో మే 20 నుంచి జూన్ 2వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) పద్ధతిలో టెట్‌ను నిర్వహించారు. పేపర్-1 పరీక్షలను ఏడు సెషన్లలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ, బెంగాలి వంటి మొత్తం 8 భాషల్లో నిర్వహించారు. పేపర్-2 పరీక్షలను 13 సెషన్లలో మొత్తం 7 భాషల్లో నిర్వహించారు. టెట్-2024కు సుమారు 2,86,381 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1 పరీక్షకు 85,996 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 57,725 (67.13%) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అలాగే పేపర్-2 పరీక్షకు 1,50,491 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 51,443 (34.18%) మంది అభ్యర్థులు అర్హత సా?ధించారు. అయితే 2023లో నిర్వహించిన టెట్‌తో పోలిస్తే.. ప్రస్తుతం పేపర్-1లో 30.2%, పేపర్-2లో 18.8 అర్హత శాతం పెరిగింది.

# స్వాగత తోరణాలతో నూతన పాఠ్య పుస్తకాలు

## - విద్యా ప్రణాళికను తూచా తప్పకుండా అమలు చేస్తాం: హెడ్ మాస్టర్ నాగమణి

**వాస్తవ నేస్తం,బోనకల్:** వేసవి సెలవు అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలో పునర్ ప్రారంభం బోనకల్ మండల పరిధిలోగల చిన్నబిరవల్లి గ్రామపంచాయతీ నందు మండల ప్రాథమిక పాఠశాల ప్రారంభించారు రాష్ట్ర చరిత్రలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల పునర్ ప్రారంభం మొదటి రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ నాగమణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ మీద ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పాఠశాలలకు అవసరమైనటువంటి అన్ని సౌకర్యాలు మెరుగు పరచటానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలలకు అవసరమైన నిధులను ఇవ్వటం జరిగిందన్నారు. మన పాఠశాలకు కూడా అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా సుమారుగా 2 లక్షల రూపాయలు మంజూరై అట్టే డబ్బు ద్వారా పిల్లలకు తాగునీటి సౌకర్యం, బాల- బాలికలకు వేరువేరుగా టాయిలెట్ సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, స్కూల్ మైనర్ రిపేర్లు, అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. గవర్నమెంట్ స్కూల్లో పిల్లలకు విద్యతోపాటు ఆటపాటలతో మానసిక వికాసం జరుగుతుందని ప్రైవేట్ పాఠశాలల్లో భట్టి విధానం వల్ల పిల్లల యొక్క మానసిక స్థితి దెబ్బతింటుందని, ఈ సంవత్సరం నుంచి కార్పొరేట్ స్కూల్స్ దీటుగా ఇంగ్లీష్ మీడియం, సెమీ రెసిడెన్షియల్ సౌకర్యం ప్రారంభించను న్నట్లు తెలిపారు. ఇట్టి సౌకర్యాన్ని గ్రామ ప్రజలు తమ పిల్లలను బడిలో చేర్పించి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయురాలు సునీత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అనూష , ఎఫర్ట్ సంస్థ నిర్వాహకరాలు నరసమ్మ ,మాజీ ఉప సర్పంచ్ సంద్ర వెంకటేశ్వర్ రావు, గ్రామ పెద్దలు చంద్ర వెంకటరావు, బుద్ధ భూపాల్, జర్నలిస్ట్ మర్సకట్ల సంజీవరావు అంగన్వాడి టీచర్స్ ఎం నాగలక్ష్మి, ఎం మరియమ్మ, అమ్మ ఆదర్శ కమిటీ మెంబర్స్, పాఠశాల పిల్లలు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




### తెలంగాణలో కొత్త మద్యం

**హైదరాబాద్ :** తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు రాబోతున్నాయన్న వార్తతో మందుబాబులు హర్షం వ్యక్తం చేశారు. కానీ.. ఆయా బ్రాండ్లపై నిరసనగా సోషల్ మీడియాలో మీమ్ లు రావడంతో.. వాటిని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. మద్యం ప్రియుల నుంచే కొత్త బ్రాండ్లపై వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు సమాచారం. బేవరేజెస్ కార్పొరేషన్ 5 కొత్త మద్యం కంపెనీలకు ఇచ్చిన లైసెన్సులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.కొత్తగా వచ్చే బీర్ బ్రాండ్లపై నెటిజన్ల నుంచి, మందుబాబుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మీమ్ లతో సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరగడంతో.. కొత్తకంపెనీలకు ఇవ్వాల్సిన అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఆపివేసినట్లు సమాచారం. రాష్ట్రం కొత్త బీర్లను సరఫరా చేసేందుకై బేవరేజెస్ కార్పొరేషన్ 5 కొత్త కంపెనీలకు అనుమతులిచ్చింది.

### ఆర్చబిష్ డాక్టర్ విజయ్ మోహన్ రావుకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**వాస్తవ నేస్తం,ఖమ్మం:** అంతర్జాతీయ క్రైస్తవ నాయకులు ఆర్చబిషప్ డాక్టర్ సి.హెచ్. విజయ్ మోహన్ రావు 63వ జన్మదిన సందర్భంగా బిషప్, డాక్టర్ పీటర్ నాయక్ లకావత్ శుభాకాంక్షలు తెలియజేశారు. నేటి క్రైస్తవ సమాజానికి ఆర్చబిషప్, డాక్టర్ విజయ్ మోహన్ రావు అనేక సేవలు చేస్తూ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆయన పీటర్ నాయక్ లకావత్ కొనియాడారు.



# ఆగని చెరువుల ఆక్రమణలు

**రంగారెడ్డి :** హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. రోజురోజుకీ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం దూసుకెళ్తోంది. ఈ క్రమంలో కబ్జాలు కూడా విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు మాయం అవుతున్నాయి. చెరువులు సైతం కనిపించకుండాపోతున్నాయి. కాలువలను కబ్జా చేసి, చెరువులను మాయం చేసి పెద్దపెద్ద నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఎన్నో వివాదాలు నెలకొన్నాయి. వాటిలో ఎర్రకుంట చెరువు ఒకటి.బాచుపల్లిలోని సర్వే నెంబర్ 134లో ఉంటుంది ఎర్రకుంట చెరువు(లేక్ ఐడీ: 2800/ఈ/17). అయితే, ఇక్కడ మూడు నిర్మాణాలకి హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల నుంచి పర్మిషన్ రావడం వివాదాస్పదమైంది. చాలా రోజులుగా దీనిపై స్థానిక బీజేపీ నేతలు పోరాడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 18న సర్వే జరిగింది. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్, బాచుపల్లి ఎంఆర్ఓ రిపోర్ట్ రెడీ చేశారు. అందులో ప్రభుత్వ భూమి కబ్జా కాలేదని, అది ప్రవేట్ భూమేనని పేర్కొన్నారు. దీన్నిబట్టి ఎర్రకుంట చెరువు మొత్తాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతులకి అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని బీజేపీ నేతలు మండిపడుతున్నారు.డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్ తీరుపై ముందు నుంచి అనుమానాలు ఉన్నాయి. ఒక్కో కో ఆర్డినేట్‌ను దాదాపు 9 మీటర్ల మేర జరిపి కార్పొరేటర్, కొందరు బిల్డర్లకు లబ్ది చేకూర్చేలా సర్వే చేశారని అంటున్నారు. మార్చి 11 తేదీన సర్వేలో చెరువు స్థలం 3 ఎకరాలు వస్తే, 18వ తేదీ చూపించిన హద్దుల తర్వాత 2.19 ఎకరాలు మాత్రమే వచ్చిందని ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. చెరువు స్థలం ఎందుకు తగ్గింది? ఎలా తగ్గిందని అడుగుతున్నారు బీజేపీ నేతలు. ఎర్రకుంటలోని ఆక్రమణలు తొలగించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తప్పుల తడకగా సర్వే నిర్వహించారని ఆరోపించారు.ఎర్రకుంట చెరువును క్రమించి తప్పుడు పత్రాలలో అనుమతులు పొంది ధ్వంసం చేశారని, సరైన సర్వే చేసి కాపాడాలని డిమాండ్ చేశారు బీజేపీ నేతలు. కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తే ఇప్పటికి గానీ సర్వేకు రాలేదని, తీరా సర్వే చేసి మూడు ఎకరాల ఎర్రకుంట చెరువు ప్రభుత్వ భూమి కాదని ప్రైవేట్‌దని రిపోర్ట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విధంగా సర్వే రిపోర్ట్ ఇవ్వడం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సర్వేయర్లు దాదాపు రెండు కోట్ల ముడుపులు దండుకొని ఆక్రమణదారులకు అనుకూలంగా సర్వే రిపోర్ట్ తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులు అక్రమ అనుమతులు, తప్పుడు సర్వే రిపోర్ట్‌పై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ సర్వేయర్ శ్రీనివాస్‌ను తక్షణమే సస్పెండ్ చేసి విచారణ జరిపి, ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని, లేకపోతే అక్కడ టెంటు వేసి నిరాహార దీక్షకు దిగుతామని బీజేపీ నాయకులు, కార్పొరేషన్ సెక్రెటరీ అరుణ్ రావు, మీడియా సెల్ కో కన్వీనర్ ఉదయ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు మాధవరావు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్ సీనియర్ నాయకులు ఎల్లస్వామి, కాలనీవాసులు తదితరులు హెచ్చరించారు. గత తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్ఎస్ నేతలు కబ్జాలకు సహకరించి, అనుమతులు ఇప్పించి ఇప్పుడు చెరువులు కాపాడాలని ఎమ్మెల్యే వివేకానంద చిలుక పలుకులు పలుకుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే ఎర్రకుంటను కాపాడాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ గౌతం, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి దీనిపై దృష్టి సారించాలని కోరారు.



# యాత్రకు రాహుల్,,

**లక్నో :** సార్వత్రిక సమరంలో ఫలితాలు దాదాపు తారుమారయ్యాయి. మూడో సారి ప్రధానిగా అధికారం చేపట్టనున్న మోదీకి ఈ ఎన్నికలు చక్కని గుణపాఠం చెప్పాయి. ముఖ్యంగా మత రాజకీయాలు, మత విద్వేషాలతో ఓట్లు రావన్న సంగతి ఇప్పటికైనా బీజేపీ నేతలు గుర్తించాలని రాజకీయ విమర్శకులు సూచిస్తున్నారు. ముఖ్యంగా యూపీలోనే బీజేపీకి మెజారిటీ స్థానాలు తగ్గిపోయాయి. అనూహ్యంగా కాంగ్రెస్ కూటమికి అత్యధిక సీట్లు వచ్చాయి. ఈ ప్రభావం యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై పడినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అందుకే రాహుల్, అఖిలేష్ ఆధ్వర్యంలో యూపీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు కాంగ్రెస్ కూటమి సిద్ధం అవుతోంది. మొత్తం యూపీలోని 403 అసెంబ్లీ నియోజకవర్గాలలో 'ధన్యవాద్ యాత్ర' పేరిట ఈ యాత్ర ఉండబోతోంది. ఈ ధన్యవాద్ యాత్ర 15న ముగుస్తుంది. ఈ యాత్రలో కూటమి సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. యాత్రలో భాగంగా సమాజంలోని పలు వర్గాలకు చెందిన వారికి రాజ్యాంగం కాపీలను బహూకరించనున్నారు.యూపీలో మొత్తం 80 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఇక కాంగ్రెస్ కూటమి ఏకంగా 43 సీట్లు కైవసం చేసుకోగా బీజేపీ 33 సీట్లకే పరిమితం అయింది. సమాజ్ వాదీ పార్టీ 37.. కాంగ్రెస్ 6 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ కంచుకోట రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీ ఘన విజయం సాధించారు.

### బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం.. ఆదర్శ సమాజాన్ని నిర్మిద్దాం



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలోని చిన్న బీరవెల్లి గ్రామపంచాయతీలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ విజయ్ కుమార్, కోఆర్డినేటర్ సురేష్, ఆదేశాల మేరకు కమ్యూనిటీ ఆర్గనైజర్ నరసమ్మ ద్వారా బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా నరసమ్మ మాట్లాడుతూ.. బడిలో ఉండాల్సిన పిల్లలు ఆటపాటలతో గడపాల్సిన పిల్లలందరికీ విద్య,ఆరోగ్యం పొందే హక్కు ఉందన్నారు. బాల కార్మికుల సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, బడికి వెళ్లాల్సిన బాల్యం బందీగా మారుతుంది చితికిపోయిన బతుకులు, మెతుకుల కోసం జీవిత పోరాటం చేస్తున్నారు. ఇటుకలు మోస్తూ,బిక్షం ఎత్తుకుంటూ కలుపుతీస్తూ, పెయింటింగ్ వేస్తూ,పశువులను కాస్తూ,బతుకును వెల్లదీస్తున్నారు ఇలాంటి పరిస్థితుల్లో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయురాలు సునీత, మాజీ ఉపసర్పంచ్ చంద్ర వెంకటేశ్వరరావు గ్రామ పెద్దలు చంద్ర వెంకట్రావు అంగన్వాడీ టీచర్స్ ఏ నాగలక్ష్మి, మర్సకట్ల మరియమ్మ, పిల్లలు, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

### విద్యార్థులు బాగా చదివి ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలి: ఏఈఓ శంకర్




**వాస్తవా నేస్తం,సంగారెడ్డి:** విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏఈఓ శంకర్ అన్నారు. సదాశివపేట మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో జెడ్పిహెచ్ఎస్ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి శంకర్ హాజరై విద్యార్థులకు ఉచిత యూనిఫాం, నోట్ బుక్స్ మరియు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ కూడా బాగా చదివి మీ యొక్క భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని అదేవిధంగా ప్రభుత్వం ఎన్నో వేల రూపాయలను ఖర్చుపెట్టి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి కృషి చేస్తుందని కాబట్టి మీరంతా బాగా చదివి ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలని అన్నారు. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలన్నీ తెరుచుకోవడంతో బడులంతా కూడా విద్యార్థులతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామ మాజీ సర్పంచ్ గంగన్న, ఎంపీటీసీ సత్యనారాయణ ,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అమృతమ్మ మరియు ఉపాధ్యాయులు, సిఆర్పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్), పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కిందని తెలిపారు. నిరుపేదలకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాబోధన కొనసాగుతోందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

### టెట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేదార్ కల్యాణి



**వాస్తవ నేస్తం,బజార్హత్నూర్:** మండలంలోని డిగ్నూర్ గ్రామానికి చెందిన కేదార్ కల్యాణి బుధవారం విడుదలైన టెట్ ఫలితాలలో ఉన్నత ప్రతిభ కనబరుస్తూ 150 కి గాను 135 మార్కులను సాధించారు. కల్యాణికి మొదటి నుండి ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా గౌరవం తను కూడా ఉపాధ్యాయ వృత్తి చెయ్యాలనే ఆశక్తితో పట్టుదలతో టెట్ ఫలితాలలో మంచి మార్కులు సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు. భర్త కేదార్ సాయినాథ్ ప్రోత్సాహంతోనే వారి సహకారంతో నేను రానున్న టెట్ పరీక్షల్లో కూడా ఉన్నత ప్రతిభ కనబరుస్తూ ఉద్యోగాన్ని సాధిస్తానని ఆశాభావం వ్యక్తపరిచారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com